కొత్త స్టాఫ్ నర్సులొచ్చారు..!

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 237 మంది కేటాయింపు
- ఇప్పటికే పలువురు విధుల్లో చేరిక
- మెరుగుపడనున్న వైద్యసేవలు

జిల్లాకు కొత్త స్టాఫ్ నర్సులొచ్చారు. దీంతో ఆసుపత్రులలో సేవలు మరింత మెరుగవ్వనున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్బీ) ఆధ్వర్యంలో నూతనంగా నర్సింగ్ ఆఫీసర్ల నియామకం కోసం నోటిఫికేషన్ ఇవ్వగా మంచిర్యాల జిల్లాకు చెందిన 266మంది ఎంపికయ్యారు. గత ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల పేర్లను నర్సింగ్ ఆఫీసర్లుగా మార్చగా, నూతనంగా నియామకమైన వారిలో కాళేశ్వరం జోన్ నుంచి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 237మందిని కేటాయించారు. ఇందులో 237మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. కాళేశ్వరం జోన్‌లో ఈ నియామకాలను చేపట్టగా, మంచిర్యాల జిల్లాకు చెందిన వారే ఇక్కడ విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపించడంతో, వారికి ఇక్కడి జిల్లానే కేటాయించారు.

– మంచిర్యాలటౌన్



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విధుల్లో చేరుతున్న స్టాఫ్ నర్సులు

మెరుగైన వైద్య సేవలకు అవకాశం...

గతంలో స్టాఫ్ నర్సులుగా కేవలం మహిళలకు మాత్రమే అవకాశం ఉండగా, ఈ సారి పురుషులకు సైతం అవకాశం కల్పించారు. 88శాతం మహిళలకు, 12శాతం పురుషులకు కేటాయించారు. దీంతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే 8మంది పురుషులు నర్సింగ్ ఆఫీసర్లుగా వచ్చారు. మొత్తం 237మందిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కేటాయించగా మంగళవారం వరకు దాదాపుగా 200మంది విధుల్లో చేరారు. మహిళలతో పాటు, పురుషులు కూడా నర్సింగ్ ఆఫీసర్లు(స్టాఫ్‌నర్సులు)గా చేరడం, వీరంతా గతంలో హైదరాబాద్ నగరంలోని నిమ్స్, గాంధీ ఆసుపత్రులతో పాటు, పలు పేరుపొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించిన వారు కావడం గమనార్హం. వీరి సేవలను మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వినియోగించుకోనున్నారు. ఇన్నాళ్లు స్టాఫ్ నర్సుల కొరతతో వార్డుల్లోని రోగులకు సరైన వైద్య సదుపాయాలను అందించక పోగా, ఇప్పుడు సరిపడా స్టాఫ్‌నర్సులు రావడంతో, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి తెలిపారు.

ఆనందంగా ఉంది



నేను పుట్టి పెరిగింది జిల్లాలోని ఐబీ తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామం. నిమ్స్‌లో 5సంవత్సరాలుగా స్టాఫ్ నర్సుగా విధులు నిర్వర్తిస్తుండగా, నాకు ప్రభుత్వ ఉద్యోగం రావడం, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోనే విధుల్లో చేరడం ఆనందంగా ఉంది.

– కొండు హేమవతి, ఐబీ తాండూర్

ఉత్తమ సేవలు అందిస్తా



మంచిర్యాల జిల్లాకు చెందిన నాకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. నిమ్స్ ఆసుపత్రిలో ఆరు సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం చేశాను. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగం రావడం, ఇక్కడే విధుల్లో చేరడం ఆనందంగా ఉంది.

– కె. శ్రీలత, ఐబీ తాండూర్

ఉద్యోగం రావడం సంతోషం..



స్టాఫ్‌నర్సులుగా గతంలో మహిళలకు మాత్రమే అవకాశం ఉండేది. ప్రస్తుతం తమకు కూడా నర్సింగ్ ఆఫీసర్‌గా పేరు మార్చి, పురుషులకు అవకాశం కల్పించడం వల్ల నాకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉద్యోగం వచ్చింది. బీఎస్సీ నర్సింగ్ చేసి ఏడాదిగా నిమ్స్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

– జొనగరి సతీశ్, కర్ణమామిడి, హాజీపూర్

ఒకే కుటుంబం నుంచి ముగ్గురు...



విధుల్లో చేరిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు

మంచిర్యాల టౌన్: మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామానికి చెందిన కూలీ కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్బి) ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాఫ్ నర్సుల(నర్సింగ్ ఆఫీసర్) పోస్టులకు ఎంపికయ్యారు. వీరిని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు. కొండు సూరమ్మ, అంకుల్‌లు ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ వారి ముగ్గురు కూతుళ్లను చదివించి, నర్సులుగా చేశారు. అందులో పెద్ద కూతురు హేమవతి జీఎన్ఎం నర్సింగ్ చేయగా, రెండో కూతురు కె. శ్రీలత జీఎన్ఎం కోర్సు అనంతరం బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. మూడో కూతురు కొండు ప్రవంతి సైతం బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయగా, వీరు ముగ్గురూ నిమ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుండగా, ప్రభుత్వం స్టాఫ్‌నర్సు(నర్సింగ్ ఆఫీసరు) పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. కాళేశ్వరం జోన్‌లో వీరు ముగ్గురు కూడా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వర్తించేందుకు ఎంపిక కావడం విశేషం.

ఎంతో ఆనందంగా ఉంది



మా అమ్మానాన్నలు ఎంతో కష్టపడి బీఎస్సీ నర్సింగ్ చదివించారు. వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఔట్‌సోర్సింగ్ విభాగంలో నిమ్స్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులుగా విధుల్లో చేరాం. కొద్ది రోజులకే ప్రభుత్వ ఉద్యోగమైన నర్సింగ్ ఆఫీసర్లుగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మా ముగ్గురికి ఉద్యోగాలు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– కొండు ప్రవంతి, నర్సింగ్ ఆఫీసర్

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఈ నెల 9, 10, 11న పోలీస్, మందమర్రి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ శశిధర్ (ఏఆర్ డీఎస్పీ) మెమోరియల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విన్నర్ ప్రైజ్‌గా నగదు రూ.20వేలు, రన్నర్ టీం ప్రైజ్ రూ.10వేలతో పాటు కప్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి డీసీపీ, ఏసీపీ, సీఐ హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న డైరెక్టర్

కాసిపేట: మండలంలోని సామగూడలో గురువారం అవుట్‌రీచ్ మ్యాప్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో సహృదయ కుట్టుశిక్షణ కేంద్రం డైరెక్టర్ పాల్‌విగ్, కరోలిన్‌విగ్‌లు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. టైలరింగ్ శిక్షణ ఐదు నెలల కాలం ఉంటుందని, మహిళలు స్వయంఉపాధి పొందేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ కల్లెం జాషువా, రత్న విజయ్‌కుమార్, బ్రదర్ స్టీవెన్, స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో రేకుర్తి కంటి ఆసుపత్రి, లయన్స్‌క్లబ్ గరిమిల్ల సభ్యులు సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన వచ్చినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోదుపురం వెంకటేశ్వర్, సీహెచ్ రాఘవేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత కంటి వైద్య శిబిరంలో చెన్నూర్‌తో పాటు కోటపల్లి మండలాల నుంచి వచ్చిన 280మందిని వైద్యులు పరీక్షించినట్లు తెలిపారు. 31మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా, రేకుర్తికి పంపిస్తామన్నారు. వైద్యులు అభిషేక్, బాస్కర్, ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు రామయ్య, పద్మనాభాచారి, తిరుపతి పాల్గొన్నారు.

జన్నారంలో పర్యాటకుల సందడి



నెమళ్ల స్థలం వద్ద విద్యార్థుల సందడి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలో గురువారం పర్యాటకులు సందడి చేశారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు జన్నారం డివిజన్ కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్ కేంద్రంలోని అధ్యాయన కేంద్రంలో ఏర్పాటు చేసిన అడవి దున్నలు, మ్యూజియం, నెమళ్ల కూడలి, జింకల పునరావాస కేంద్రం, గేట్ నంబర్ 1 వద్ద పర్యాటకుల సందడి కనిపించింది. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తన కుటుంబీకులు, విద్యాసంస్థల ఉపాధ్యాయులతో కలిసి ఇక్కడ పర్యటించారు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: జిల్లా క్రెడాయ్(కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నూతన కార్యవర్గాన్ని గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా క్రెడాయ్ జాతీయ జనరల్ సెక్రటరీ జి.రామ్‌రెడ్డి హాజరు కాగా, జిల్లా క్రెడాయ్ చైర్మన్‌గా దినేష్ కుమార్, అధ్యక్షుడిగా యూ.పున్నంచందు, సెక్రటరీగా వంశీ, ట్రెజరర్‌గా ఎన్.సంతోశ్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ పురెల్ల పోచమల్లు, వైస్ ప్రెసిడెంట్ ఎస్కే వదూద్, ఎడ్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థి మృతి



నీలేష్(ఫైల్)

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన విద్యార్థి నీలేష్(16) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. నీలేష్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఉపాధి కోసం ముంబాయి వెళ్లగా, అతను మామిడిపల్లిలో నానమ్మ వద్ద ఉండి చదువుకుంటున్నాడు. బుధవారం రాత్రి పురుగుల మందు తాగగా, గమనించిన స్థానికులు అతడిని చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ, గురువారం రాత్రి మృతి చెందాడు. కాగా అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

'సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తాం'



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మరింత చిత్తశుద్ధితో పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానంలో విజయవంతం సాధించిన అనంతరం తొలిసారి పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించారు. మొన్నటివరకు కౌన్సిల్ సమావేశాల్లో తమ పాత్ర చేతులెత్తటం, సంతకాలు పెట్టడం వరకే సరిపోయేదని అసలు మాట్లాడే స్వేచ్ఛ తమకు ఉండకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో స్థానికులకు 80శాతం ఉద్యోగాలిచ్చేలా ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీసీసీ రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపతిరాజయ్య, అబ్దుల్‌అజీజ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాల పెంపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాన్ని రూ.1000 పెంచుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులను జారీ చేయడంపై మంచిర్యాల మున్సిపల్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రామగిరి బానేశ్, చిప్పకుర్తి నర్సయ్య, మాడుగుల నవీన్, రేగుంట వెంకటి, కోకిల శ్రీనివాస్, సత్తయ్య, దుర్గమ్మ, సది, ఆసంపల్లి పోచమ్మ, గోగర్ల రాంచందర్, బొల్లం రత్నం, సుమన్, రాజయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మందమర్రిరూరల్: సింగరేణిలో స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతోనే సీఎం ఆదేశించారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, అనుబంధసంఘాల నాయకులు ఉన్నారు.



గుడిపేటలో పారిశుధ్య పనులు



పాఠశాల ఆవరణలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

గ్రామాల్లో పారిశుధ్య పనులు

బెల్లంపల్లిరూరల్/కాసిపేట/చెన్నూర్‌రూరల్/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం పలు మండల కేంద్రాల్లో పారి శుధ్య పనులు చేపట్టారు. ప్రత్యేక అధికారు ల పర్యవేక్షణలో మురికి నీటి కాలువలు శుభ్రం చేశారు. చెత్త, చెదారాన్ని, పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలు, నాయకులు, అధి కారుల సమష్టి కృషితో గ్రామాల్లో పరిశుభ్రత సాధ్యమవుతుందని గ్రామ ప్రత్యేకాధికారులు పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కోటపల్లి: అనిమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం కోటపల్లి మోడల్ స్కూల్లో ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్తపరీక్షలను డాక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అనిమియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, వీరస్వామి పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

భీమారం: ఉమ్మడి జైపూర్ మండల స్థాయిలో భీమారం మండలం ఆంకూసాపూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు, మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల్లో మిట్టపల్లి టీం మొదటి బహుమతి, రన్నర్‌గా పెగడపల్లి నిలిచింది.

పనులు పరిశీలించిన డీపీవో



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీవో వెంకటేశ్వర్ రావు

భీమారం: జైపూర్, భీమారం మండలాల్లో నిర్వహిస్తున్న పారుశుధ్య పనులను గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన పారుశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. మురుగుకాలువల్లోని నీటిని ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా దోమల వ్యాప్తిని తగ్గించవచ్చునన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉదయమే పర్యటిస్తూ పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇందులో జైపూర్, భీమారం ఎంపీడీవోలు పీ సత్యనారాయణ, శ్రీనివాస్‌లతోపాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వయోజన విద్య, కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని 15వ వార్డు దీపక్‌నగర్‌లో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల లయన్స్ క్లబ్ వారి సహకారంతోవయోజన విద్యా కేంద్రంతో పాటు కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ సీఈవో నరేందర్, వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీరా పురుషోత్తం హాజరై ప్రారంభించారు. సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని కల్పన, మున్సిపల్ డీఈ సుమతి, మంచిర్యాల లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, సఖి డీఆర్పీ శాంకరీ, స్థానికులు ఉప్పులేటి నరేష్, గోపిక, శేఖర్ తదితరులు ఉన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి కేజీబీవీ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థినులకు మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో.. బేటీ పడావో, బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' లబ్ధిదారుల వివరాల సేకరణ



భీమారంలో వివరాలు నమోదు

భీమారం/నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజాపాలనలో భాగంగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నవారు వారి వివరాలు తెలియజేయాలని విద్యుత్ సిబ్బంది తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి ప్రజాపాలన దరఖాస్తు సంఖ్య, ఆహార భద్రత కార్డు సంఖ్య, ఆధార్ కార్డు నంబర్ వివరాలు అందజేయాలన్నారు. సిబ్బంది వచ్చిన సమయంలో అందుబాటులో లేని వినియోగదారులు విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో కానీ విద్యుత్ సహాయ గణాంక అధికారి కార్యాలయంలో కానీ వివరాలు అందజేయాలని సూచించారు. గురువారం హాజీపూర్‌లో మంచిర్యాల రూరల్ ఏడీఈ నూక రాజశేఖర్, నెన్నెలలో విద్యుత్ ఏఈ మల్లయ్య ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, భీమారంలో విద్యుత్తుశాఖ ఏఈ కుమార్, ఏవో రత్నాకర్ ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. హాజీపూర్‌లో మహాలక్ష్మి పథకానికి సంబంధించి రూ.500 గ్యాస్ అమలుకు లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు.

'క్యాంపస్ టు కార్పొరేట్'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ అబ్దుల్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో కోకోకోలా బేవరేజెస్ ప్రైవేటు లిమిటెడ్ వారి భాగస్వామ్యంతో క్యాంపస్ టు కార్పొరేట్ అనే సాఫ్ట్ స్కిల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్‌గా ఎండి అబ్దుల్ వ్యవహరించగా, కళాశాలలోని విద్యార్థులను వారి యొక్క వృత్తి ఉద్యోగాల్లో నైపుణ్యాన్ని సాధించేందుకు ఎలాంటి మార్గాలను అనుసరించాలో వివరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. సుమతి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. శివలీల, టాస్క్ కోఆర్డినేటర్ టి. కవితారాణి, టాస్క్ కమిటీ సభ్యులు బి. దేసిపాల, సయ్యద్, ఏ. శైలజ పాల్గొన్నారు.

ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా...

బెల్లంపల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా ఏర్పర్చుకుని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, టాస్క్ రిసోర్స్ పర్సన్ ఎండి అబ్దుల్ ముఖీత్‌లు అన్నారు. కళాశాలలో విద్య నుంచి ఉద్యోగం సాధించే దిశగా ఉద్యోగ నైపుణ్యం, ఇంటర్వ్యూల మెళకువలులో భాగంగా గురువారం 'క్యాంపస్ టు కార్పొరేట్ ట్రైనింగ్ ప్రోగ్రాం' అనే టాస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టాస్క్ తరుపున హైదరబార్ నుంచి రిసోర్స్‌పర్సన్ అబ్దుల్ ముఖీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రామునిచెరువు ఉత్తరం వైపు మాస్టర్‌ప్లాన్ 100ఫీట్ల రోడ్డుపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని స్వచ్ఛంద పౌరసేవా సంస్థ అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మొగిలి తిరుపతి గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. 100రోడ్డుకు హద్దులు నిర్ణయించి దురాక్రమణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రంగు రాజేశం, కైలాసం, రాధేశ్యాం, మహ్మద్‌పాషా పాల్గొన్నారు.

జయగోపాల్ మృతి తీరని లోటు

బెల్లంపల్లి: సాంస్కృతిక ఉద్యమకారుడు, ఆధునిక ఆంధ్ర పెరియార్‌గా పిలువబడే డాక్టర్ జయగోపాల్ మృతి ప్రజలకు తీరని లోటు అని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ భారత నాస్తిక సమాజం నాయకులు అన్నారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జయ గోపాల్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం కార్యదర్శి గొడిసెల స్వామి, నాయకులు జ్యోతి కుమార్, రవి, కిష్ట, నారాయణ, మేము సైతం సామాజిక నాయకుడు ప్రశాంత్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్ అన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుప్రతిని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, వార్డులను, ఓపీ రిజిస్ట్రేషన్, ఆరోగ్య శ్రీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అధిక సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వైద్యులు రవి, శ్రీఖర్, సిబ్బంది ఉన్నారు.

సీఎంఓఏఐ అధ్యక్షుడికి సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డిని ఆర్కే 5గనికి చెందిన పలువురు యూనియన్ నాయకులు సన్మానించారు. గనిపై ఆయన్ను గని సీనియర్ నాయకులు నెల్కి మల్లేశ్, ప్రవీణ్‌లు గురువారం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ రావు, సత్తిరెడ్డి, గోపాల్, అనిల్, సురేందర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

బెల్లంపల్లిరూరల్: రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు తాళ్లగురిజాల ఎస్సై నరేష్ అవగాహన కల్పించారు. అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్లనే అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు రాజన్న, మజారుద్దిన్, సిబ్బంది ఉన్నారు.

పేదలకు పట్టాలివ్వాలి

చెన్నూర్: మండలంలోని బావురావుపేట శివారులో గల 8 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆర్‌ఐ రంజిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గుడిసె వాసులకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చందు, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899